# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం ‘కౌముది‘ పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

The conscious mind is the editor, and the unconscious mind is the writer.

*- David Mamet*

You and your significant other are invited by Dorothy Matthews and Suzanne Silvers to a literary evening of conversation and dessert. Come and meet Mr. Malladi Murthy, a writer renowned in his home of Hyderabad, India. He will present synopses of some of his work and engage in discussion. We hope to see you there.

**When:** Thursday, May 14, 2009, 7:30pm
**Where:** 14 Greenway Plaza, #21 P, Houston, 77046, (off Timmons);
**Phone** : 713-850-7733
**RSVP:** Reply to this email or leave a phone message for Dorothy - 713-668-8802

**నేను రాసిన కొన్ని కథలు,** కొన్ని నవలల గురించి వినడానికి సాహితీ సమావేశానికి రమ్మని 2009లో పంపిన ఈమెయిల్ ద్వారా పంపిన ఆహ్వానం అది. ఆ సమావేశానికి పదిమంది అమెరికన్ శ్రోతలు (ఒకరు ఫ్రెంచ్ చరిత్ర నేపథ్యంలో నవలలు రాసే రచయిత్రి కూడా ఉన్నారు) హాజరు అయ్యారు. గంటన్నర జరిగిన ఆ సమావేశంలో నేను రాసిన కొన్ని కథలు, నవలల సారాంశం చెప్పాను. స్టాలిన్ అనే నేను రాసిన కథకి ఇంగ్లీష్ అనువాదం చదివాను. తర్వాత వారి ప్రశ్నలకి జవాబులు చెప్పాను. హైరైజ్ అపార్ట్‌మెంట్స్‌లోని ఇరవై ఒకటవ అంతస్థులో ఉన్న మిసెస్ సుజానే సిల్వర్స్ ఇంట్లో ఆ సమావేశం జరిగింది. ఇద్దరు భూటానీ రెఫ్యూజీస్ ప్రత్యేకంగా వచ్చి చేసిన చికెన్, వెజిటేరియన్ డంప్లింగ్స్, జీడిపప్పు, వేరు శెనగపప్పు, ఐస్ క్రీమ్, వైన్, పమగ్రనేట్ టీ ఇంకా అనేక రకాల సాఫ్ట్ డ్రింక్స్ సర్వ్ చేశారు.

తన పంతొమ్మిదో ఏట మొదటగా చందమామలో ఓ సింగిల్ పేజి కథ పడ్డ ఈ రచయిత ఈ స్థాయికి ఎలా ఎదగగలిగాడు? అసలు ఇతను రచయిత ఎలా అయ్యాడు? అని ఆ రచయితకే అనిపిస్తోంది.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.......

✡ ✡ ✡

*నేను రచయితని ఎలా అయ్యాను?*

నేను రచయిత అవడానికి ప్రధాన ప్రేరణ నా బాల్యంలో, అంటే 1960లలో చదివిన అనేకానేక పత్రికలూ, నవలలు. నాకు ఏడుగురు అక్కలు. వాళ్ళందరికీ పత్రికా పఠనం అంటే ఎంతో ఆసక్తి. మా అమ్మ మల్లాది శారదాంబ ఆంధ్రప్రభ వీక్లీ కొనేది. విజయవాడలోని మా పక్కింటివాళ్ళు ఆంధ్ర పత్రికని కొనేవారు. వాటిని మేము ఎక్స్చేంజ్ చేసుకుని చదువుకునేవాళ్ళం. ఆ రోజుల్లో ప్రధాన వినోదం పత్రికలే. మధ్య తరగతి వాళ్ళు ఈ పద్ధతిని అనుసరించేవారు. సినిమాలకి నెలలో ఓ సారి మాత్రమే వెళ్ళేవారు.

ఇలా నా ఏడో ఏట నుంచే నేను తెలుగు పుస్తకాలు చదవడం ఆరంభించాను. సాయంత్రాలు నేను మా ఇంటికి ఐదు నిముషాల నడక దూరంలో ఉన్న గాంధీనగర్‌లోని ఓ లైబ్రరీకి వెళ్ళి అనేక పుస్తకాలని చదివేవాడిని. అది నాగేశ్వరరావు పంతులు రోడ్లో ఎస్.కె.పి.వీ.వీ స్కూల్ సమీపంలో ఉండేది. నేను పెద్దయ్యాక అది లేదు.

చందమామల్లో వచ్చే సింద్‌బాద్ నావికుడు సీరియల్, కంచుకోట సీరియల్, పరోపకారి పాపన్న మొదలైనవి ఆసక్తిగా చదివేవాడిని. నాకు గల ఆనాటి జ్ఞాపకాలలో ఒకటి దీపావళికి ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలు వెలువరించే ప్రత్యేక సంచికలు. ఎక్కువ పేజీలతో, కునేగా మరికొళందు సెంటుతో ఘుమఘుమలాడుతూ వచ్చేవి అవి. వాటిని చదవడానికి మా కుటుంబ సభ్యులంతా పోటీపడేవారం. ఆనాటి చాలామంది పాఠకులకి కూడా ఈ అనుభవం గుర్తుకురావచ్చు. బహుమతి పొందిన కథలని చదివేసాక ఇక ఆ వారపత్రికల మీద ఆసక్తి తగ్గేది. అలాగే యువ, జ్యోతి మాసపత్రికలూ దీపావళి, సంక్రాంతి పండగలకి ఎక్కువ పేజీలతో వచ్చేవి. వాటిలో ప్రముఖ రచయితల కథలు ఉండేవి. అవసరాల రామకృష్ణారావు, ఇచ్ఛాపురపు జగన్నాథరావు, భరాగో, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, ఆదివిష్ణు తదితరుల కథలు వాటిలో వచ్చేవి. పది - పన్నెండు ఏళ్ళు వచ్చాక హనుమాన్ పేటలోని జిల్లా గ్రంధాలయానికి వెళ్ళి పుస్తకాలు చదివేవాడిని. చక్కటి పాఠకుడు చక్కటి రచయిత అవుతాడన్నది నా విషయంలో జరిగింది. నేను కథ చదువుతూ అది ఇలా ముగుస్తుంది అనుకునేవాడిని. కొంత చదివాక కాదు ఇలా ముగుస్తుంది అనుకునేవాడిని. చాలా తరచూ ఆ కథలు మరోలా ముగిసేవి. ఇలా కథలని నిర్మించే నైపుణ్యం నాకు ఈ మానసిక ఆలోచనా పంథావల్ల అప్పట్లోనే పట్టుపడింది. తర్వాత కాలేజీలో చదివేప్పుడు నేను విజయవాడ లీలామహల్లో, నవరంగ్ టాకీసులో చూసిన అనేక వందల ఇంగ్లీష్ సినిమాలవల్ల కూడా ప్లాట్ నిర్మాణం, కథల్లో మలుపులు గురించి చక్కటి అవగాహన ఏర్పడింది.

_నా రచనా శైలి గురించి...._

నా రచనా శైలి, వాక్య నిర్మాణం ఆ రోజుల్లోనే ఫారం అయింది. నాకు బాగా గుర్తు. పత్రికల్లోని కొందరి కథలు ఇలా మొదలయ్యేవి. ***"ఈ లోకంలో మూడు రకాల మనుషులున్నారు. ఒకరు తమ కోసం తాము జీవించేవారు. మరొకరు ఇతరుల కోసం జీవించేవారు. ఇక మూడోరకం వారు తమకోసం కాని, ఇతరులకోసం కాని జీవించలేనివాళ్ళు. ప్రకాశం ఈ మూడో తరగతికి చెందినవాడు."*** మూడోరకం గురించి సూటిగా చెప్పకుండా కథకి సంబంధంలేని మిగిలిన రెండు రకాల గురించి రచయిత ఎందుకు ప్రస్తావిస్తాడు? అని విసుక్కునే వాడిని. లేదా బాలభానుని నునులేత కిరణాలు పృధ్విని స్పరిస్తున్నాయి. పిట్టలు గూటి నుంచి బయలుదేరుతున్నాయి. ఇలా ఒకటి రెండు పేరాలు ప్రకృతి వర్ణనతో సాగేవి. ఆ పేరాలని స్కిప్ చేసి కథ ఎక్కడినుంచి మొదలవుతుందా అని వెదికేవాడిని. పత్రికల్లోని రచనలని చదువుతూ కథకి సంబంధం లేని వివరణలు, వర్ణనలని, రచయిత చెప్పే పాత్రల మనస్తత్వ చిత్రణని, ఫిలాసఫీని చదవడంలో విసుగుని అనుభవించేవాడిని.

సంభాషణతో మొదలయ్యే కథ అరుదుగా దొరికేది. వాటిని ఆసక్తిగా చదివేవాడిని. ఇలా పాఠకుడిగా రచయిత ఎలా రాస్తే నాకు బావుంటుంది అన్న విషయం మీద నాకు ఆ కథల వల్ల ఓ అవగాహన ఏర్పడింది.

అదే సమయంలో ఇవికాక టెంపోరావు, గుత్తా బాపినీడు, డాక్టర్, భయంకర్, విశ్వప్రసాద్, ప్రసాద్, కనకమేడల, భగవాన్, కొమ్మూరి సాంబశివరావు మొదలైన వారి డిటెక్టివ్ నవలలని మా ఇంట్లో అద్దెకి ఉన్న మద్దాలి సీతమ్మగారు తమ బంధువుల నుంచి తెచ్చి మాకు ఇచ్చేవారు. డిటెక్టివ్ నవలల్లో ఇలా విసుగు కలిగించేవి కనిపించేవి కావు. ఎందుకంటే వారు కథని సంభాషణల ద్వారా నడిపించేవారు. పత్రికల్లోని రచనలకి, డిటెక్టివ్ నవలలకి చదవడంలోని సౌలభ్యంలోని తేడాని స్పష్టంగా గమనించగలిగాను. డిటెక్టివ్ నవలల్లో ఫిలాసఫీని చెప్పేవారు కారు. కథని చెప్పడానికే ప్రాముఖ్యతని ఇచ్చేవారు. గాంధీనగర్ లోని న్యూ ఇండియా సెంటర్లో బళ్ళమీద అద్దెకి ఇచ్చే కొమ్మూరి నవలలని తెచ్చుకుని చదివేవాడిని. వాటి వెల అర్ధరూపాయి. రోజుకి అణా అద్దె. వాటిని అణా లైబ్రరీలు అనేవారు.

సాధారణంగా ఆ రచనలు సంభాషణలతోనే మొదలయ్యేది. సంభాషణలతో సాగే కథని పాఠకుడిగా నేను విసుగులేకుండా చదివేవాడిని. అందుకని నా రచనల్లో కూడా ఇదే టెక్నిక్‌ని అనుసరిస్తున్నాను.

ఆ రోజుల్లో నేను పత్రికల్లో చదివిన అనేక వేల మంది రచయితల రచనా విధానాలే ఈ విధంగా నాకు మార్గదర్శకత్వం అయ్యాయి. ఎలా రాయాలో కంటే వారినుంచి ఎలా రాయకూడదో నాకు చిన్న వయసులోనే తెలిసింది. ఏ సమాచారం పాఠకుడిగా నాకు విసుగ్గా ఉండేదో దాన్ని నా రచనల్లో దొర్లకుండా నేను రచయితగా మొదటినుంచీ జాగ్రత్తని తీసుకోసాగాను. పైగా మెత్తటి వాక్య నిర్మాణంలో దిట్ట అయిన కొమ్మూరి సాంబశివరావు నవలలు చాలా అనేకమార్లు చదవడం వల్లనేను ఆయన శైలి చేత ఆకర్షించపడ్డాను. నాకు అలాంటి వాక్యాలు రాయడంబాగా పట్టుపడటం నా అదృష్టం పాఠకుడిని కన్ఫ్యూజ్ చేయకుండా, వారి మెదడుని స్ట్రెయిన్ చేయకుండా ఎలా చెప్పాలి అని నేను ఆనాటి డిటెక్టివ్ సాహిత్యం ద్వారా బాగా గ్రహించాను. ఆ సూత్రాన్ని ఆనాటి డిటెక్టివ్ రచయితలు గ్రహించి పాటించారు. పత్రికల్లోని కథలని రాసే పోకడకి, డిటెక్టివ్ నవలల్లో రాసే పోకడకి గల తేడాని పట్టుకోగలిగాను. ఈ కారణంగా నా శైలి సులభంగా ఉండి పాఠకులని స్ట్రెయిన్ చెయ్యకుండా చదివిస్తుంది. నా శైలి నా సంతకం అయి, కొన్ని పేరాలు చదివితే ఇది మల్లాది రచన అని నా రచనలు చదివే పాఠకులు గుర్తుపట్టగలరు. ఇది నేను వారి నోట అనేకసార్లు విన్న విషయం.

వాడుక భాష చదివి అర్థం చేసుకోవడంలో వత్తిడి ఉండదని అనుభవపూర్వకంగా గ్రహించాను. పైగా కొమ్మూరి సాంబశివరావు రచనలు నా భావనని మరింత పెంచి పోషించాయి. అందుకే అందరికి తెలిసిన వాడుక భాషలోని పదాలనే ఉపయోగించాలని రచయితకాక మునుపే స్థిరమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నాను. నయనములు, నేత్రములు అని రాసే కంటే కళ్ళు అని రాస్తే తేలిగ్గా అర్థమవుతుంది అని గ్రహించాను. నా రచనల్లో ఘనమైన, నిత్యజీవితంలో వాడని పదాలు చాలా అరుదుగా కాని చోటుచేసుకోవు. ఆనాటి కొందరు రచయితలు కథ నడకకి సంబంధంలేని ఫిలాసిఫిని పాత్రలద్వారానో లేదా తామే చెప్పేవారు. ఇది నాకు ఎంతో విసుగుని కలిగించేది. నేను దీన్ని వ్యతిరేకించబట్టి నా రచనల్లో అలాంటివి ఎన్నడు రాయలేదు. పాత్రల స్వభావాలని కూడా రచయితలు వివరించేవారు. సుబ్బారావు ఎలాంటివాడో అతని చర్యలు, మాటలు అంతర్లీనంగా పాఠకులకి తెలియచేయాలి కాని రచయిత చెప్పకూడదు అనేది నేను బలంగా నమ్మాను. డిటెక్టివ్ నవలల్లో రచయితలు చెప్పకపోవడం వల్ల చదవడానికి హాయిగా ఉండేది. అందుకని నేను రచయితని అయ్యాక పాత్రల స్వభావాలు కాని, భౌతిక వర్ణనలని కాని చేయలేదు. పాఠకులు వారి మాటలు, ప్రవర్తనల ద్వారా వాటిని ఏర్పరచుకునే అవకాశాన్ని కల్పిస్తుంటాను. ఇలా నా శైలి నేను పాఠకుడిగా ఉండగానే నాకు తెలియకుండా ఏర్పడింది.

నాకు బాగా గుర్తు. ఫోర్త్ ఫాం పరీక్షలు రాసాక వేసవి సెలవలలో ఓ రోజు రెన్ అండ్ మార్టిన్ ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాన్ని కాలక్షేపానికి చదివాను. అందులో వివిధ పంక్చ్యుయేషన్ మార్కులని ఎప్పుడు ఉపయోగించాలో వివరంగా ఉదాహరణలతో సహా ఇచ్చారు. అవి నాకు గుర్తుండిపోయాయి. నేను నా రచనల్లో పంక్చ్యుయేషన్ మార్కులని ఇప్పటికి ఆ గ్రామర్లో చెప్పినట్లుగానే ఉపయోగిస్తున్నాను. పెద్దపెద్ద రచయితలు కూడా.. మూడు చుక్కలని సరిగ్గా ఉపయోగించరు! వాక్యం మధ్యలో వాటిని ఉపయోగిస్తారు. ఓ పాత్ర మాట్లాడుతూ మధ్యలో ఆపేసిన గుర్తుగా మూడు చుక్కలని వాడాలి. లేదా రచయిత ఓ వాక్యం పూర్తిచేయకుండా వాటిని వాడితే మిగిలిన వాక్యం పాఠకులు అర్థం చేసుకోగలిగినప్పుడు వాడాలి. లేదా పాత్ర మాట్లాడేటప్పుడు స్థిరాభిప్రాయం లేదని సూచించడానికి. పాత్ర మాట్లాడే మాటలకి ఇన్వర్టెడ్ కామాలు వాడాలి. దురదృష్టవశాత్తు చాలామందికి ఇది కూడా తెలీదు. ప్రూఫ్‌లు దిద్దుతూ వాళ్ళ డైలాగ్‌ని, రచయిత నెరేషన్ని గుర్తించలేరు. నెరేషన్‌కి ఇన్వర్టెడ్ కామాలు ఇస్తారు. సంభాషణకి ఇవ్వరు! చాలా పత్రికల్లో వచ్చిన నా నవలలని నేను ఈ విషయంలో దిద్ది ప్రెస్‌కి పంపుతుంటాను. కొమ్మూరిగారు పంక్చ్యుయేషన్ మార్కులని  చక్కగా వాడేవారు.

నేను చదివిన రచనల్లో నాకు బాగా బోరు అనిపించిన మరొకటి పేరాలు. చాలా పెద్ద పేరాలని చదవడానికి నాకు అసౌకర్యంగా ఉండేది. నేను చిన్న పేరాలని రాయడానికి కారణం పాఠకులకి నేను పడ్డ స్ట్రెయిన్ని ఇవ్వకూడదని.

నేను కాలేజీలో చదివేప్పుడు ఓసారి ఓ కథని రాసాను. అది తెలిసి మా నాన్న మల్లాది దక్షిణామూర్తిగారు చదువు చెడుతుందని కథలని రాయొద్దని చెప్పారు. దాంతో మళ్ళీ రాయలేదు. అప్పుడప్పుడు మా నాన్నగారు 'కథలు రాస్తున్నావా? మానేశావా?' అని అడిగేవారుకూడా. కాకపోతే వేసవి సెలవల్లో వంద పేజీల పుస్తకంలో పాతిక దాకా సోషల్, డిటెక్టివ్ నవలలు రాసాను. వాటిని దినపత్రికలోని పేజీలతో చేసిన కవర్లలో అతికించేసేవాడిని. ఇతరులు చదువుతారని భయం. ఇలా రాయడం కూడా పదహారు, పద్దెనిమిదేళ్ళ వయసులో నాకు ప్రాక్టీసు అయింది. ఆ రాసే అనుభవం నాకు తర్వాత రచయితగా చాలా సహాయం చేసింది. నేను మళ్ళీ వాటిని చదివి రాయలేదు. చాలా కాలం ఆ కవర్లు నా దగ్గర ఉన్నాయి. ఉద్యోగరీత్యా విజయవాడ నుంచి హైదరాబాద్‌కి 1970 ఫిబ్రవరిలో వచ్చినప్పుడు వాటిని నా వెంట తెచ్చాను. తర్వాత ఒకటి, రెంటిని చదివాను కాని నాకే నచ్చలేదవి. ఎటో పోయాయి అవి. కొమ్మూరి సాంబశివరావుగారి సాంఘిక నవలల ధోరణిలో, కొంత సెక్స్ కలిపి రాసిన నవలలవి.

✡ ✡ ✡

బి.కాంలో నా క్లాసుమేటు మురళి అని ఒకడు ఉండేవాడు. అతనికి కూడా నాకులాగానే ఏడుగురు సిస్టర్స్. వాళ్ళు పత్రికలని కొనేవారు. అతను కూడా నాలాగే చిన్నప్పటినుంచి పత్రికలు చదివేవాడు.

1968 అయివుండచ్చు. ఓ రోజు నాకు వాడు రాసిన ఓ కథని చదవమని ఇచ్చాడు. 'ఘనమైన అయ్యా' అన్న పదాలతో అది మొదలైంది. నాకు బాగా గుర్తు. కొద్దిరోజులకి మేము అలంకార్ సినిమా హాల్లో హిచ్ కాక్ సినిమా ఒకటి మార్నింగ్ షో చూసి అలంకార్ సినిమా హాల్ని దాటి ఎదురుగా ఉన్న వంతెన మీదకి రాగానే తన కథ ఎలా ఉందని అడిగాడు. కథా రచనలో నేను ఏర్పరచుకున్న అభిప్రాయాలని అన్నిటి ప్రకారం ఆ కథ బాగాలేదని విశ్లేషణాత్మకంగా చెప్పాను. నా పరిజ్ఞానానికి వాడికి ఆశ్చర్యం వేసింది. మేం మంచి మిత్రులమే అయినా ఎన్నడూ కథల గురించి అంతదాకా మాట్లాడుకోలేదు. అతను తర్వాత దేవరకొండ మురళి అనే తన పేరుతో పదిహేను కథలుదాకా రాసాడు. ఇటీవలే 'కౌముది'లో మాయాబజార్ మీద రాసిన ఓ ఆర్టికల్ మురళిది వేశారు.

1969 మార్చికి నా చదువు బికాం అయిపోయింది. జూన్‌కి ఫలితాలు వచ్చి పాస్ అయ్యాను. 1970 ఫిబ్రవరిలో ఉద్యోగ రీత్యా సికింద్రాబాద్ వచ్చి, మా నాన్నగారి మిత్రులు శ్రీ ముస్త్యాల వెంకయ్యగారి ఇంట్లో, రాష్ట్రపతి రోడ్‌లోని పోస్ట్ ఆఫీసు ఎదురుగా ఉన్న ఇంట్లో బస చేసాను. నాకు చిన్నప్పటినుంచి కథలకి అయిడియాలు తట్టేవి. వాటిని ఓ చిన్న పుస్తకంలో రాసుకునేవాడిని. అక్కడ ఉద్యోగంలో చేరిన మొదటి ఆదివారం ఓ కథని రాసాను. తర్వాత ఫెయిర్ చేసి దాన్ని చందమామకి పోస్ట్ చేసాను. పత్రికకి, ప్రభకి, అపరాధ పరిశోధనకి వరసగా ఒకో కథని ఒకో ఆదివారం రాసి పోస్ట్ చేసాను. నేను అప్పుడు ఓ సంగతి గమనించాను. ఫెయిర్ చేసేప్పుడు చిత్తు ప్రతి చూడకుండానే తర్వాతి పదం, వాక్యం అలానే రాసేవాడిని. తర్వాత చూస్తే చిత్తు ప్రతిలో అలాగే ఉండేది. ఇలా చాలా సార్లు అనుభవం అయ్యాక నేను వాక్యాలని, పదాలని ఒకేలా రాస్తానని అర్థమయ్యింది. దాంతో తిరగరాసే ప్రయత్నం మానుకున్నాను.

వెంకయ్యగారి పుత్రులు ముస్త్యాల భూమయ్య, లక్ష్మణ్‌రావులు. లక్ష్మణరావుగారికి, ఆయన శ్రీమతి ప్రభావతికి పత్రికా పఠనం అలవాటు. నా ఆఫీసుకి వెళ్ళడానికి నేను సికందరాబాద్ రైల్వే స్టేషన్ దగ్గర సిటి బస్సు ఎక్కేవాడిని. అక్కడ మేగజేన్స్ అమ్మే షాపులు చాలా ఉండేవి కాబట్టి నన్ను వారం, వారం ప్రభ, పత్రికలని, నెలనెలా చందమామని కొనుక్కురమ్మని, నెలాఖరుకి లెక్క చూసి డబ్బు ఇచ్చేవారు. వారు కారు ఆపుకుని కొనాల్సి వచ్చేది కాబట్టి ఆ పనిని నాకు పురమాయించారు.

ఆగస్టు రెండు 1970. ఆ రోజు నేను చందమామని సికింద్రాబాద్ స్టేషన్ నించి బస్‌లో సీట్ దొరక్క, నుంచుని రావడంతో దాన్ని తిరగేయలేదు. ఇంటికి నడిచి వస్తూ ఎప్పటిలా చూసాను కాని నాకు నా కథ కనపడలేదు. రాగానే లక్ష్మణరావు గారు నా చేతిలోంచి దాని తీసుకుని తెరవకుండానే చెప్పారు "దీంట్లో నీ కథ పడిందని పందెం."

నేను ఆ పత్రికకి కథని పంపానన్న సంగతి గుర్తున్నా వేసుకుంటామనే కార్డు రాలేదు కాబట్టి ధైర్యంగా జవాబు చెప్పాను. ''రాలేదని పందెం.''

''కథ వస్తే దీనికి పంపే డబ్బు నాకు ఇవ్వాలి.'' చెప్పారు.

''అలాగే'' ధైర్యంగా ఒప్పుకున్నాను. ఆయన ఓ పేజి తెరచి అందులో వచ్చిన సింగిల్ పేజి కథని నాకు చూపించారు. 'ఉపాయశాలి' అన్న పేరు గల ఆ కథ, కింద మల్లాది వెంకట కృష్ణమూర్తి అనే పేరు కనపడింది. అది నేను రాసిన కథే! అప్పుడే నాకు అర్థంకాలేదు ఆ సంగతి ఆయనకి ఎలా తెలిసిందో. బహుశా చందమామ నుంచి కథని ప్రచురణకి తీసుకున్నామన్న కార్డ్ ఇంటికి వచ్చి ఉంటుంది. అది ఆయన చదివి దాచి ఉండచ్చు. నాకు ఎన్నడూ ఆ కార్డు ఆయన ఇవ్వలేదు. నాకు వచ్చిన పారితోషికం 15 రూపాయలు. ఆయన దాన్ని తీసుకోలేదు. (ఆ కథ చదవాలనుకునేవారు ఈ లింకుని క్లిక్ చేయండి. **http://www.chandamama.com//content/story_img_archive/PdfFlip.php?lang=telugu&yr=1970&mnth=8&adOpt=0** )

పేరు ఉపాయశాలి. ఆ విధంగా తొలిసారి 1970 ఆగస్ట్ రెండోతారీకు సాయంత్రం అయిదున్నర - ఆరు మధ్య 68 రాష్ట్రపతి రోడ్లోని ఆ ఇంట్లో నా పేరుని అచ్చులో చూసుకున్నాను. ఆ తర్వాత ఆ ఇంట్లో చాలా కథలు రాసాను.

అయితే అచ్చులో నా పేరు చూసుకోవడం అదే మొదటిసారి కాదు. నేను కాలేజీలో ఉండగానే డిటెక్టివ్ అనే మాసపత్రిక మద్రాస్ నుంచి వెలువడేది. దాన్ని లైబ్రరీలో చదివేవాడిని. దాని చివరి పేజీలో ఓ క్రైమ్ కథ ఇచ్చి నేరస్తున్ని కనుక్కోమనేవారు. ఓసారి సరదాకి సొల్యూషన్ రాసి పంపాను. ఆ కథ నాకు ఇంకా గుర్తుంది. ఓ హంతకుడు ఒకర్ని విషం ఇచ్చి చంపుతాడు. ఎలా? హతుడు కవరుకి ఉన్న జిగురిని నాలికతో తడిపి కవరుని అతికిస్తాడు. ఆ కవరు జిగురు విషంతో చేసింది.

తర్వాతి సంచికలో విజేతల జాబితాలో ఎం.వి.కె మూర్తి, విజయవాడ అని నా పేరు ప్రచురించారు. దాని గురించి ఎవరికీ చెప్పలేదు. ఆ పత్రికని కొనలేదు కూడా. నిజానికి నాకేమి అది గొప్ప విషయంగా అనిపించలేదు. ప్రఖ్యాత అమెరికన్ కవి రాబర్ ఫ్రాస్ట్ ఇరవైఏళ్ళపాటు అనేక పోయమ్స్ రాసాడు. కాని అతని ముప్పై తొమ్మిదో ఏట కాని అతని పొయిట్రీ బుక్‌ని పబ్లిషర్లు ప్రచురించలేదు. ఈ రోజు అతని పద్యాలు ఇరవై రెండుభాషల్లోకి అనువదించబడ్డాయి. నాలుగుసార్లు పొయిట్రీలో రాబర్ట్ ఫ్రాస్ట్‌కి పులిట్జర్ ప్రైజులు వచ్చాయి. ఆయన్ని సాహితీలోకం ఆలస్యంగా గుర్తించింది. ఈ విషయంలో నేను అదృష్టవంతుడిని అనే చెప్పాలి. నేను రాసిన మొదటి కథే వెనక్కి రాకుండా ప్రచురించబడింది. అంతే కాకుండా వరసగా పత్రిక, ప్రభ, అపరాధ పరిశోధనల్లో కూడా నా కథలు 1970 ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వెంట వెంటనే వరసగా వచ్చాయి. దాంతో రచయితగా నాలో ఆత్మ విశ్వాసం కలిగింది. లక్ష్మణరావు గారు ఒకటి సూచించారు. అంత పెద్ద పేరు ఎందుకు? ఎం.వి.కే మూర్తి పేరు చిన్నదిగా బావుంటుంది అని చెప్పారు. అది నా తలకి ఎక్కలేదు. ఆయన సూచన పాటించి ఉంటే ఎం.వి.కే మూర్తి సింపుల్‌గా ఉండేది అనిపిస్తుంది ఇప్పుడు. పూర్తి పేరుని పెట్టుకోవడం విషయంలో కూడా కొమ్మూరి సాంబశివరావుగారిని అనుసరించాను.

(వచ్చే నెలలో మరికొన్ని విశేషాలు)

✡ ✡ ✡